ప్రజాశక్తి
మంగళవారం 25 ఏప్రిల్ 2023

ముఖ్యమంత్రి పర్యటన ఖరారు

ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యటన ఖరారైంది. ఈ మేరకు అధికారిక ప్రకటనతోపాటు, షెడ్యూల్‌ను సమాచార శాఖ విడుదల చేసింది. ఈనెల 17వ తేదినే నార్పలకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యటన ఖరారు అయ్యింది. అప్పట్లో అధికారులు ఏర్పాట్లు అన్నీ పూర్తి చేసిన సమయంలో అనివార్య కారణాలతో పర్యటన రద్దయింది. దీంతో వైసిపి నాయకులు, అభిమానుల్లోనూ నిరాశనే మిగిలింది. అయితే తాజాగా మరోమారు ఆయన పర్యటన ఖరారవడంతో అధికారులు ఏర్పాట్లను యథావిధిగా చేపడుతున్నారు. నార్పల క్రాస్ వద్ద సభా వేదికను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లను ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ముఖ్యమంత్రి పర్యటన సమన్వయ కర్త తలశీల రఘురాంలు సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. నార్పలలోని జూనియర్ కళాశాల మైదానంలో హెలీప్యాడ్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి వేదిక వద్దకు వచ్చి వసతి దీవెన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించనున్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఇలా...

ఈనెల 26వ తేదీన ఉదయం 8.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి ముఖ్యమంత్రి అనంతపురం జిల్లా పర్యటనకు విచ్చేయనున్నారు. 8.50 గంటలకు గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి తొమ్మిది గంటలకు ప్రత్యేక విమానంలో బయలుదేరి 9.45 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు. పుట్టపర్తి విమానాశ్రయం నుంచి ఉదయం 10 గంటలకు హెలిక్యాప్టర్‌లో బయలుదేరి 10.20 గంటలకు నార్పల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌లో దిగుతారు. అక్కడ జిల్లా ప్రముఖులు, ప్రజాప్రతినిధులతో ముఖాముఖి అవుతారు. 10.40 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి నార్పల క్రాస్ వద్దకు చేరుకుంటారు. ఫొటో గ్యాలరీని తిలకిస్తారు. ఉదయం 11 గంటలకు వేదికపైకి వస్తారు. ప్రజాప్రతినిధుల ప్రసంగాలు, లబ్ధిదారులతో ముఖాముఖి అనంతరం ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. వసతిదీవెన చెక్కుల పంపిణీ అనంతరం 12.30 గంటలకు కార్యక్రమం ముగుస్తుంది. కార్యక్రమం అనంతరం 12.45 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. జిల్లా నేతల వీడ్కోలు అనంతరం హెలిక్యాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 1.30 గంటలకు పుట్టపర్తికి చేరుకుంటారు. అనంతరం 1.45 గంటలకు విమానంలో తిరుగు ప్రయాణమై 2.45 గంటలకు గన్నవరం చేరుకుంటారు.

భారీగా జనసమీకరణకు ఏర్పాటు

చాలా కాలం తరువాత జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన సాగుతున్న తరుణంలో పెద్దఎత్తున ఏర్పాట్లను జిల్లా అధికార యంత్రాంగంచ చేపడుతోంది. సుమారు పది వేల మంది వరకు విద్యార్థులను ఈ కార్యక్రమానికి హాజరు పరిచే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వీరితోపాటు మరో 20 వేల మందిని సభకు సాధారణ జనాన్ని తీసుకొచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ముందు నిర్ణయించిన ప్రకారం 250 ఆర్టీసీ బస్సులను ఇందుకోసం ఏర్పాటు చేస్తున్నట్టు సమాచారం. వేసవి కాలం కావడంతో జనాలు ఇబ్బంది కలుగకుండా ఉండే విధంగా ప్రత్యేకమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం వైద్యులను సైతం ప్రత్యేకంగా నియమించారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

నార్పల: ఈ నెల 26వ తేదీన నార్పలో చేపట్టనున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను కలెక్టర్ ఎమ్.గౌతమి ఆధ్వర్యంలో సోమవారం పరిశీలించారు. హెలీప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకూ నడుచుకుంటూ వెళ్లి ప్రతి అంగుళం తనిఖీ చేశారు. హెలీప్యాడ్ నుంచి సభా వేదిక వరకూ దాదాపు రెండు కిలోమీటర్ల దూరం సీఎం కాన్వాయ్ ప్రయాణానికి ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడికక్కడ బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. సభకు హాజరయ్యే విద్యార్థులు, తల్లిదండ్రులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రేపు సాయంత్రానికల్లా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని, ప్రజలంతా సహకరించి సీఎం జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఐజీ ఆర్ఎన్.అమ్మిరెడ్డి, ఎస్పీ కంచి శ్రీనివాస రావు, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు, ఆర్డీవోలు మధుసూదన్, నిశాంత్ రెడ్డి, జె.రవీంద్ర, ఆర్అండ్‌బి ఎస్ఈ ఓబుల్‌రెడ్డి, డీపీవో ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

గుట్టుగా గనుల లీజు

◆ అమిగోస్ సంస్థ కనుసన్నల్లో మైండ్స్ అండ్ జియాలజీ శాఖ

◆ నరీస్ విధానంతో కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకం

◆ గందరగోళంగా మారిన భూగర్భ గనుల శాఖ విధివిధానాలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

ప్రకతి మానవాళికి అంతులేని సంపదలను సమకూర్చి పెట్టింది. అందులో ప్రధానమైనవి అటవి, ఖనిజ సంపద. ఈ రెండు శాఖల అనుసంధానంతో ప్రజలు ప్రభుత్వానికి ఆదాయ వనరు సమకూరుస్తోంది. అటవీ శాఖ పరిధిలోని భూగర్భ గనులు కొన్ని చోట్ల ఉండగా మరికొన్నిచోట్ల మైన్స్ అండ్ జియాలజీ ఆధీనంలో ఉన్నాయి. ఇటీవల కాలంలో భూగర్భ గనుల శాఖ నుంచి ప్రభుత్వానికి ఆదాయం భారీగా సమకూరుతోంది. ఈ నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత అధికార వైసిపి ప్రభుత్వం ఈ శాఖను ప్రయివేటు పరం చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడమే కాక కొత్త విధానానికి తెరలేపింది. అందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం గనుల శాఖపై ప్రత్యేక దష్టి సారించి ఆ శాఖ పరిధిలోని ఖనిజ సంపద ఇతర మినరల్స్ వంటి వాటిపై అన్ని హక్కులను ప్రయివేటు పరం చేసే విధంగా టెండర్లు పిలిచి అమిగోస్ మినరల్స్ అనే సంస్థకు వాటిని లీజుకు కేటాయించినట్లు సమాచారం.

కదిరిలో ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాలు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో భూగర్భ గనుల ఖనిజ సంపద మినరల్స్ వంటి వాటిపై రూ 10.80 కోట్లకు కేటాయించినట్లు సమాచారం. ఉమ్మడి అనంత జిల్లాలో అత్యధిక శాతం సంపద ఎక్కడ ఉందో అక్కడ ఆ సంస్థ తరపున తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేసి కార్యకలాపాలను కొనసాగిస్తుండడం గమనార్హం. ఎంతో హంగు ఆర్భాటాలతో తనిఖీ కేంద్రాలను జిల్లాలో కొన్ని చోట్ల ఏర్పాటుచేయగా మరికొన్ని ప్రాంతాల్లో తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది. భూగర్భగనులు ఖనిజ సంపదలు ఎక్కడ ఉన్నాయో ఆ ప్రాంతాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయా ప్రజా ప్రతినిధుల కనుసనల్లోనే ఏర్పాటు చేస్తుండడం గమనార్హం.

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా కదిరి, పెనుగొండ, రాప్తాడు, రాయదుర్గం, కళ్యాణదుర్గం, హిందూపురం, తాడిపత్రి, మడకశిర, ధర్మవరం నియోజకవర్గంలో అత్యధికంగా భూగర్భ గనుల వనరులు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో కొండగుట్టలు ఇతర భౌగోళిక వనరులపై ఆధారపడి లక్షలాది మంది పేదలు జీవనం సాగిస్తున్నట్లు ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి. ఇంత పెద్ద ఎత్తున ఎస్సీ, ఎస్టీ బీసీ, వర్గాలకు చెందిన కుటుంబాలు భూగర్భ గనులు ఇతర సంపదను ప్రజలకు అందిస్తున్నాయి. ఇటీవల కాలంలో అధికారం పార్టీ విధించిన ఉత్తర్వులు వారి జీవన విధానానికి శాపంగా మారిందనీ పలువురు మేధావులు, పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్ధేశించిన ఆదేశాల మేరకు స్థానిక తహశీల్దార్, ఆర్డీవో పరిధిలో లీజ్ ఏర్పడిన రాయల్టీ చెల్లించి తమ జీవన విధానాన్ని వత్తిని కొనసాగించేవారు. ప్రస్తుతం అధికార ప్రభుత్వం గనుల శాఖను ప్రయివేటుకు దారాధత్తం చేయడంతో పేద కుటుంబాలు దిక్కుతోచక అల్లాడుతున్నాయి. నూతన పాలసీ విధానం అమలు చేయడంతో అమిగొస్ సంస్థ ఆంక్షలు పెడుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తంచేశారు. భూగర్భ గనులు శాఖ ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాలు ఇబ్బుడి ముబ్బుడిగా దర్శనమిస్తుండగా మరికొన్నిచోట్ల ఎందుకు ఏర్పాటు చేయడం లేదు అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వాస్తవానికి ఒకవైపు నూతన లీనరీస్ పాలసీ వల్ల ప్రభుత్వ ఆదాయం కోట్లలో వస్తుందని ఆ శాఖ అధికారులే చెబుతున్నారు. మిగిలిన అనధికారకంగా వస్తున్న ఆదాయం ఎవరి జోబులోకి వెళ్తున్నది ఆ శాఖ అధికారులకే తెలియాల్సి ఉంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో భూగర్భ మైన్స్‌అండ్ జియాలజి శాఖ సంబంధించి తనిఖీ కేంద్రాలు ఎక్కడెక్కడ పెట్టారో.? ఎన్ని ఉన్నాయో.? ఎవరి పర్యవేక్షణలో నడుస్తున్నాయి.? అన్నది తెలియకుండా గోప్యత ప్రదర్శించడం వెనుక మతలబు ఏమిటో గనుల శాఖ అధికారులకు తెలియాల్సి ఉంది. ఇదిలా ఉండగా కొండగుట్టలో ఖనిజ సంపదను తీసుకెళ్లడానికి సంబంధిత కాంట్రాక్టర్ లీజు విధానంలో కొంత మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించి అనుమతులు పొందుతారు. మరికొంతమంది కాంట్రాక్టర్లు ప్రభుత్వ భవనాలు ఇతర రోడ్లు పనులు అభివద్ధి పనుల చేస్తున్న సమయంలో తాము చేసిన పనులకు సంబంధించి అంతకుముందే టెండర్ వేసేటప్పుడు ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించి ఎంబుక్ సైతం రికార్డు చేసి అనుమతులు పొందుతుంటారు. వాస్తవానికి ప్రభుత్వ పనులకు నాడు-నేడు రోడ్లు వంటి పనులకు రాయల్టీ లేదు. అందుకు విరుద్ధంగా తప్పనిసరిగా రాయల్టీ చెల్లించే విధంగా అనధికార విధివిధానాలను అమలు చేస్తూ భారీ స్థాయిలో డబ్బులు దండుకుంటున్నట్లు ఆ వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతోపాటు రాళ్లను కొట్టుకుంటూ జీవనం సాగిస్తున్న వారితో కూడా డబ్బులు వసూలు చేస్తూ అనుమతులు తప్పనిసరి చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. భూగర్భ గనుల శాఖ అధికారుల పర్యవేక్షణలో కొనసాల్సిన తనిఖీలు ప్రయివేటు సంస్థతో చేతులు కలిపి వారి వాహనాలులో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ప్రవేటు సంస్థ కేవలం అనంతపురం జిల్లాలో మాత్రమే తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేసి రాష్ట్రంలో ఎక్కడ ఏర్పాటు చేయకపోవడం ఏమిటన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

మోడీ నిరంకుశ పాలనపై నేడు బహిరంగ సభ

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ భారాలు మోపుతున్న ప్రధాని మోడీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా అనంతపురం నగరంలో మంగళవారం నాడు బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. సోమవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో సిపిఎం నగర కమిటీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచిపెడుతూ ప్రజలపై భారాలు మోపి నడ్డివిరుస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రయివేటీకరిస్తోందన్నారు. రాష్ట్ర విభజన అంశాలు ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. సెంట్రల్ యూనివర్శిటీ నిర్మాణంలో తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. జిల్లాలో ఏర్పాటు చేస్తామన్న జాతీయ సంస్థలు నాసన్, బెల్, వంటి సంస్థలు ఏ ఒక్కటి ఏర్పాటు చేయలేదన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీ కరించేందుకు సిద్ధమైంద న్నారు. గుంతకల్ రైల్వేజోన్ ఏర్పాటు చేయలేదన్నారు. మోదీ ప్రభుత్వం 9 ఏళ్ల పాలనలో రాజ్యాంగ వ్యవస్థలన్నీ నిర్వీర్యం అవుతున్నాయని తెలిపారు. అక్రమ పద్ధతిలో 11 రాష్ట్రాల్లో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ప్రతిపక్షాలు లేకుండా చేయడానికి కుట్ర చేస్తోందన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

బిజెపియేతర రాష్ట్రాల్లో అధికారం చెలాయించేందుకు అనేక వక్ర మార్గాలు అనుసరిస్తూ స్వార్థపూరిత రాజకీయాలు చేస్తోందన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన అవసరం ఉందన్నారు. మోదీ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో చైతన్యం కల్పించడంలో భాగంగా ప్రచార పాదయాత్ర, సమావేశాలు, సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేడు సాయంత్రం 5 గంటలకు నగరంలో పాతూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం నిర్వహించే బహిరంగ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాబురావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి, నగర నాయకులు వెంకటనారాయణ, ముస్కిన్, వలీ, ప్రకాష్, మసూద్, జీవా, రాజు, వెంకటేష్, ప్రసాద్, వరలక్ష్మి, ఎర్రిస్వామి, బాలక్రిష్ణ, లక్ష్మినారాయణ, నూరుల్లా శీనా పాల్గొన్నారు.

పంచాయతీల్లో సంపద సృష్టి : కలెక్టర్

పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న కలెక్టర్ ఎమ్.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వాలు ఇచ్చే నిధుల మీద ఆధారపడుతున్న గ్రామాలు సొంతంగా ఆదాయం సమకూర్చుకుని సంపద సృష్టించే స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఎమ్.గౌతమి ఆకాంక్షించారు. సోమవారం ఉదయం స్థానిక జెడ్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకల్లో జెడ్పీ ఛైర్మన్ బోయ గిరిజమ్మతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో సమస్య ఉంటే మండలానికో, జిల్లా కేంద్రానికో వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామ స్థాయిలోనే సమస్య పరిష్కారం అయ్యే విధంగా గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు అయ్యిందన్నారు. గ్రామ స్థాయిలో కార్యక్రమాలకు స్థానిక పంచాయితీ ఆదాయం నుంచి నుంచి ఖర్చు చేసే రోజులు రావాలన్నారు. జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ 73వ రాజ్యాంగ సవరణ గ్రామ, మండల, జిల్లా స్థాయిలో పంచాయతీల ఏర్పాటుకు చట్టబద్ధత తీసుకువచ్చి మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి నాంది పలికిందన్నారు. గ్రామాలు, మండలాలు, జిల్లాలు అని తేడా లేకుండా అన్ని స్థాయిలోనూ అభివద్ధి జరిగినప్పుడే దేశం అభివద్ధి చెందుతుందన్నారు. అనంతరం పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా 9 కేటగిరీల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన గ్రామ పంచాయతీలకు జిల్లా కలెక్టర్, జెడ్పీ చైర్ పర్సన్ లు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ నరసింహా రెడ్డి, డీపీవో ప్రభాకర్ రావు, పంచాయతీ రాజ్ ఎస్ఈ భాగ్యరాజ్, సర్పంచులు పాల్గొన్నారు.

'స్పందన' సమస్యలకు పరిష్కారం : కలెక్టర్

అర్జీదారులు సంతప్తి చెందేలా స్పందన అర్జీలకు పరిష్కరించాలని కలెక్టర్ ఎమ్.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో స్పందన గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నుంచి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో 389అర్జీలను అధికారులు స్వీకరించారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ శాఖల్లో నిర్ణీత గడువులోపే అర్జీలను పరిష్కరించేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అధికారులు పరిష్కరించిన అర్జీలకు సంబంధించిన అర్జీదారులు వారు ఆశించిన స్థాయిలో వారి దరఖాస్తు పరిష్కారం కానప్పుడే అవి రీఓపెన్ అవుతాయన్నారు. ఈ అంశంపై జిల్లా అధికారులందరూ ప్రత్యేక వ్యక్తిగత దష్టి సారించి వారి క్షేత్రస్థాయి సిబ్బందికి అర్జీలను నాణ్యతాయుతంగా,అర్జీదారులు సంతప్తి చెందేలా తగు సూచనలు జారీ చేయాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన 2723 సమస్యలకు సంబంధించిన అధికారులు ఆ సమస్యలపై తీసుకున్న చర్యలనివేదికను వెంటనే సిపిఒకు పంపాలన్నారు. స్పందన కార్యక్రమం అనంతరం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డిఆర్ఓ గాయత్రిదేవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, సుధారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో హై టెన్షన్..!

◆ జెసి.ప్రభాకర్‌రెడ్డి గృహ నిర్బంధం

◆ పెన్నా ఇసుకరీచ్ వద్దకు వెళ్లకుండా అడ్డగింత

◆ పోలీసుల తీరుపై జెసిపిఆర్ ఆగ్రహం

ప్రభాకర్‌రెడ్డిని బలవంతంగా గృహ నిర్బంధం చేస్తున్న పోలీసులు

వంటావార్పుతో నిరసన తెలుపుతున్న టిడిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి తాడిపత్రి

తాడిపత్రిలో హై టెన్షన్ వాతావరణం నెలకొంది. సోమవారం నాడు జెసి.ప్రభాకర్‌రెడ్డి పెద్దప్పూరు మండలంలోని పెన్నా ఇసుక రీచ్ సందర్శనకు బయల్దేరారు. శాంతిభద్రతల దృష్ట్యా అక్కడికి వెళ్లేందుకు వీల్లేదంటూ అయన్ను పోలీసులు అడ్డుకుని గృహ నిర్బంధం చేశారు. ఇదే సమయంలో తాడిపత్రి మున్సిపల్ కమిషనర్ తీరును నిరసిస్తూ టిడిపి కౌన్సిలర్లు వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని కూడా పోలీసులు అడ్డుకున్నారు.

ప్రభాకర్‌రెడ్డి గృహ నిర్బంధం..

మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డిని పోలీసులు గృహ నిర్బంధం చేశారు. పెన్నానదిలో అక్రమ ఇసుక రవాణా తరలింపును ఆపాలని డిమాండ్ చేస్తూ సోమవారం నాడు ప్రభాకర్‌రెడ్డి పెద్దపప్పూరు మండలం పెన్నానదిలో ఇసుక తరలింపు పరిశీలనకు వేళ్లేందుకు తన అనుచరులతో కలిసి ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చారు. తాడిపత్రి ప్రాంతంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఆయన అక్కడికి వెళ్లేందుకు వీల్లేదంటూ పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. ఇంట్లో ఉన్న ప్రభాకర్‌రెడ్డి బయటకు వచ్చి మీడియాతో మాట్లాడే ప్రయత్నం చేశారు. గృహ నిర్బంధంలో ఉన్న వ్యక్తి బయటకు వచ్చి, మీడియాతో మాట్లాడేందుకు వీల్లేదంటూ పోలీసులు వారించారు. ఇందుకు ప్రభాకర్‌రెడ్డి ఒప్పులేదు. దీంతో డీఎస్పీ చైతన్య ఆధ్వర్యంలో పోలీసులు ఆయన్ను బలవంతంగా ఎత్తుకుని ఇంట్లోకి తీసుకెళ్లారు. ఈ సమయంలో పోలీసులు, టిడిపి నాయకుల మధ్య తీవ్ర స్థాయిలో తోపులాట జరిగింది. ఆయన ఇంటి నుంచి బయటకు రాకుండా, జెసి అనుచరులు తెలుగుదేశం కార్యకర్తలు ఇంటి వద్దకు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి, గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ చైతన్య మాట్లాడుతూ చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోరాదన్నారు. పెన్నానదిలో ఇసుక అక్రమ రవాణాపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

టిడిపి కౌన్సిలర్ల వంటావార్పు...

తాడిపత్రి మున్సిపాల్టీలో కమిషనర్ అభివృద్ధికి సహకరించలేదని ఆరోపిస్తూ ఆయన వైఖరికి నిరసనగా పురపాలక సంఘం కార్యాలయం ఎదురుగా వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా టిడిపి కౌన్సిలర్లు పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అక్కడ నుంచి ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డిని కలిసేందుకు ఆయన ఇంటి వద్దకు ర్యాలీగా బయల్దేరారు. వీరిని పోలీసులు అడ్డుకుని వెనక్కు పంపారు. ఈ విషయం తెలుసుకున్న ప్రభాకర్ రెడ్డి మున్సిపల్ కౌన్సిలర్లు చేపట్టిన వంటావార్పు కార్యక్రమంలో పాల్గొనేందుకు మున్సిపల్ కార్యాలయం వైపు వెళ్లడానికి ప్రయత్నం చేశారు. గృహ నిర్బంధంలో ఉన్నందున బయటకు వెళ్లేందుకు వీల్లేదంటూ జెసిపిఆర్‌ను పోలీసులు అడ్డుకున్నారు.

కమిషనర్‌పై శాఖ పరమైన చర్యలు తీసుకోండి
టిడిపి కౌన్సిలర్లు

తాడిపత్రి పురపాలక సంఘం అభివద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కౌన్సిల్ తీర్మానాన్ని పెడచెవిన పెడుతున్న కమిషనర్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. పురపాలక సంఘానికి సంబంధించిన మార్కెట్ వేలంపాటలు జరపనందుకు జరిగిన నష్టానికి కమిషనర్ బాధ్యత వహించాలన్నారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలు, కాలువలు ఆక్రమించి రోడ్లు వేయడం, మున్సిపల్ కార్యాలయంలో మాయమైన 12 టైర్లు, విలువైన పరికరాలకు కమిషనర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

నాలుగేళ్లయినా పూర్తికాని బాలికల కళాశాల

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు సెల్ఫీ ఛాలెంజ్

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన రాయదుర్గం బాలికల జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులు నాలుగేళ్లయినా పూర్తి కాలేదని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు అన్నారు. తన 50 వారాల సెల్ఫీ ఛాలెంజ్‌లో భాగంగా సోమవారం పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాల వద్ద సెల్ఫీ దిగి ఛాలెంజ్ విసిరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాతికేళ్ల రాయదుర్గం ప్రజల కల బాలికల జూనియర్ కళాశాల అన్నారు. వారి కలను సాకారాం చేయాలనే ఉద్దేశంతో 2017-18లో తాను చీఫ్‌విప్‌గా ఉన్న సమయంలో బాలికల జూనియర్ కళాశాలను మంజూరు చేయించానని గుర్తు చేశారు. అప్పట్లో కళాశాల నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించడంతోపాటు నాబార్డ్ సాయంతో రూ.52 లక్షలతో భవన నిర్మాణాన్ని కూడా ప్రారంభించామన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పెండింగ్ పనులను కూడా పూర్తి చేయకపోవడం బాధాకరమన్నారు. ఫలితంగా పట్టణంలోని బాలికల హైస్కూలులో 700 మంది ఇంటర్ విద్యార్థులు ఇరుకు గదుల్లో ఇబ్బందుల మధ్య విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, విప్ కాపు రామచంద్రారెడ్డి స్పందించి వెంటనే బాలికల జూనియర్ కళాశాలను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రాజు, గుమ్మగట్ట టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి కాలవ సన్నన్న, కెపి.దొడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికల జూనియర్ కళాశాల వద్ద సెల్ఫీ ఛాలెంజ్ చేస్తున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు



సబ్ ఎడిటర్ రమేష్‌బాబును సన్మానిస్తున్న ప్రజాశక్తి సిబ్బంది

ప్రజాశక్తి సబ్‌ఎడిటర్ రమేష్‌కు వీడ్కోలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజాశక్తి దినపత్రికలో సబ్‌ఎడిటర్‌గా పని చేసిన ఆకుల రమేష్ బాబును సాహితీ సంస్థ ఆధ్వర్యంలో సన్మానించారు. సోమవారం నాడు బళ్లారి రోడ్డులోని ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయంలో డెస్ఇన్‌ఛార్జి టి.శివప్రకాశ్ ఆధ్వర్యంలో అభినందన, వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎడిషన్ మేనేజర్ ఎన్.వేణు గోపాల్, స్టాఫ్ రిపోర్టర్ షఫీవుల్లా, జిల్లా ఇన్‌ఛార్జి మురళి హాజరయ్యారు. డీఎస్సీ-98కు ఎంపికైన రమేష్‌ను శాలువాలు, పుష్పగుచ్ఛాలు జ్ఞాపికను అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా మేనేజర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజాశక్తి కుటుంబ సభ్యుడు రమేష్ ప్రభుత్వ ఉద్యోగిగా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. మనిషి జీవితంలో ప్రభుత్వం ఉద్యోగి కావాలని కలలు కంటుంటామని, డీఎస్సీ రాసిన 22 ఏళ్ల తరువాత ఉద్యోగం రావడం అంటే సంతోషించదగిన విషయం అన్నారు. 13 ఏళ్ల పాటు పత్రికలో పని చేసి సమాజ చైతన్యంలో పని చేసిన రమేష్‌కు ఇప్పుడు భావి భారత పౌరులను తీర్చిదిద్దే అవకాశం రావడం అభినందనీయం అన్నారు. రమేష్ ఎక్కడ పని చేసిన సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి సిబ్బంది డేవిడ్, సుధాకర్, రవిచంద్ర, నాగార్జునతో పాటు ప్రజాశక్తి అనంతపురం ఎడిషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

'స్పందన'లో సిఐటియు వినతి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న ఎన్ఎంఆర్, కోవిడ్, మలేరియా, గార్బేజ్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సిఐటియు అనుబంధ సంస్థ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం ఆధ్వర్యంలో హెల్త్ ఆఫీసర్ గంగాధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈమేరకు సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించిన అనంతరం యూనియన్ నాయకులు మాట్లాడుతూ కష్టపడి పని చేస్తున్న కార్మికులకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకుంటే ఎలా జీవనం సాగిస్తారని ప్రశ్నించారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించడంతోపాటు ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే చనిపోయిన కార్మికుల కుటుంబాలలో కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలని, డెత్ క్లైమ్ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు ఎటిఎం నాగరాజు, ఎర్రిస్వామి, తిరుమలేశు, రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మీనరసమ్మ (ట్రెజరర్), మంత్రి వరలక్ష్మి, సిఐటియు నగర మాజీ కార్యదర్శి ఎస్.లక్ష్మీనారాయణ, గురు రాజా, కమిటీ సభ్యులు శ్రీనివాస్‌మూర్తి, బంగ్లా రాఘవేంద్ర ప్రసాద్, శేషేంద్రకుమార్, నారాయణస్వామి, నబీసాబ్, కార్మికులు పాల్గొన్నారు.

హెల్త్ ఆఫీసర్ గంగాధర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం నాయకులు

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

గార్లదిన్నె: మండల పరిధిలోని ముకుందాపురం గ్రామంలో ఎస్సీ, బీసీ నిరుపేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ పేదలకు ఇల్లు కట్టుకునేందుకు సెంటు స్థలం ఇవ్వని ప్రభుత్వ అధికారులు ధనవంతులు మాత్రం ఎకరాలకు ఎకరాల ప్రభుత్వ భూములను కట్టబెడుతున్నారన్నారు. వెంటనే పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్, కార్యదర్శి వెంకటరాముడు, జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు నాగరాజు, సిపిఎం కార్యదర్శి చెన్నారెడ్డి, నాగమ్మ, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి అవార్డులకు గడేకల్, విడపనకల్ ఎంపిక

ఉరవకొండ : ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో పిల్లల స్నేహపూర్వక గ్రామపంచాయతీలుగా విడపనకల్ మండల పరిధిలో గడేకల్, విడపనకల్లు గ్రామాలు ఎన్నికయ్యాయి. ఈమేరకు సోమవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో గడేకల్ పంచాయతీ సెక్రటరీ సోమయ్య, సర్పంచి సుశీల ఉమాశంకర్, విడపనకల్ పంచాయతీ సెక్రటరీ మహబూబ్ బాషా, సర్పంచి బోయ చంద్రశేఖర్‌కు ప్రశంసాపత్రాలు అందజేశారు.

బుక్కరాయసముద్రం ఎస్ఐగా వెంకటేశ్వర్లు

బుక్కరాయసముద్రం : మండల ఎస్ఐగా వెంకటేశ్వర్లు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. యాడికి మండలంలో పని చేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలు, ఫ్యాక్షన్ నిర్మూలనకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా కలెక్టర్ కార్యాలయం నుంచి చెరువు కట్ట మీదుగా అసాంఘిక కార్యక్రమాలు, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

పతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలి : జెఎన్‌టియు విసి

మొక్క నాటి నీరు పోస్తున్న జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన

అనంతపురం : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల సి.ఎస్.ఇ విభాగంగా నూతన భవనం ముందు 1962-1977 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీలైనంత ఎక్కువ మంది మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. మొక్కలను నాటడమే కాకుండా జాగ్రత్తగా పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్, యూనివర్సిటీ డైరెక్టర్లు బి.ఈశ్వర్‌రెడ్డి, సి.శోభాబిందు, కిరణ్మయి, భువనవిజయ, పద్మ సువర్ణ, మాజీ ఆచార్యులు వి.శంకర్, వివిధ విభాగాల అధిపతులు బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయండి

శింగనమల : ముఖ్యమంత్రి హోదాలో మొట్టమొదటిసారి నియోజకవర్గంలోని నార్పలకు వస్తున్న సిఎం జగన్ పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

బాధిత రైతుకు ఆర్థికసాయం

శింగనమల : మండల కేంద్రంలోని రైతు కాయల సూర్యనారాయణకు తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు శనివారం ఆర్థికసాయం చేశారు. రైతు సూర్యనారాయణకు చెందిన గడ్డివామికి గుర్తు తెలియని దుండగులు ఆదివారం నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న దండు శ్రీనివాసులు రైతును ఓదార్చి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సి.వెంకటేష్, దాసరి గంగాధర్, మాజీ ఎంపిటిసి కుళ్లాయప్ప, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి ఎం.ఆదినారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షులు బండి వెంకటనారాయణ, జడేజా, కాయల సురేష్, యాదవ్ మైనార్టీ పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి మహమ్మద్ గౌస్, దండు సతీష్ రాయల్, కాయల నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు 'స్పందన'కు 80 ఫిర్యాదులు : ఎస్పీ

అనంతపురం సిటీ : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 80 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా నలమూలల నుంచి విచ్చేసిన ప్రతి బాధితుడితో ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. అంతేగాకుండా జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీసు అధికారులతో పిటీషనర్లతో మాట్లాడించారు. చట్టపరిధిలో సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం

సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వి.రాంభూపాల్, సి.జాఫర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రజలు సిద్ధం కావాలని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వి.రాంభూపాల్, సి.జాఫర్ పిలుపునిచ్చారు. నగరంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో సోమవారం ఉభయ పార్టీల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి దేశాన్ని పాలించే నైతిక హక్కు లేదన్నారు. ఎన్నికల్లో చెప్పిందొకటి 9 ఏళ్లలో చేసింది మరొకటిగా ఉందన్నారు. కార్పొరేట్ సంస్థల యాజమాన్యాలకు కొమ్ము కాస్తూ దేశ సంపదను దోచిపెడుతోందన్నారు. కార్మికులను వెట్టి చాకిరికీ గురిచేసేలా చట్టాలను సవరించిందన్నారు. వ్యవసాయ రంగాన్ని ఏమాత్రం ప్రోత్సహించడం లేదన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్న మోదీ ప్రభుత్వం ఉన్న వాటిని తొలగించే పనిలో నిమగ్నమైందన్నారు. జిఎస్‌టి పేర పన్నుల రూపంలో ప్రజలను దండుకుంటోందన్నారు. నిత్యావసరాల ధరలు పెంచి భారం మోపిందన్నారు. ప్రజల ఆస్తులు మొదలు, ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రయివేటీకరణ చేస్తోందన్నారు. మత విద్వేషాలు రెచ్చగొడుతూ పబ్బం గడుపుకుంటోందన్నారు. ఇలాంటి రాజకీయాలు దేశానికి, ప్రజలకు ప్రమాదకరం అన్నారు. బిజెపి ప్రభుత్వం గద్దె దిగితేనే దేశం బాగుపడదన్నారు. ఈ క్రమంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మోదీ ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసేందుకు పాదయాత్రలు, సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా నేడు పాతూరులోని బ్రహ్మంగారి దేవాలయం వద్ద సాయంత్రం 5 గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబురావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రజలు, కార్మికులు, రైతులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు

పండ్ల తోటల రైతులకు అపారనష్టం

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

ఈఏడాది పండ్లతోటల రైతులకు భారీ నష్టం వాటిల్లిందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం గుమ్మఘట్ట మండలంలో రైతులు సాగు చేసిన మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ సీజన్ ఆరంభంలో పడిన వడగండ్ల వానలు, ఇతరత్రా కారణాల వల్ల పూత సక్రమంగా రాక, వచ్చినా పిందెలు రాలడం వల్ల దిగుబడి బాగా తగ్గిపోయిందన్నారు. ముఖ్యంగా చీనీ, అరటి, మామిడి పంటల రైతులు దారుణంగా దెబ్బతిన్నాయన్నారు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా చీనీ 42490 హెక్టార్లలో, అరటి 14811, మామిడి తోటలు 22908 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్నాయన్నారు. ఆయా పంటలు సాగు చేసిన రైతులందరూ నష్టపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. మరోవైపు జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత రైతులకు పంట నష్టపరిహారం అందకపోగా రైతులకందే సాయం కూడా సరిగా దక్కడం లేదనివిమర్శించారు. జిల్లాలో సుమారు 40వేల ఎకరాల్లో ఉన్న అరటికి కనీసం బీమా సౌకర్యం కల్పించకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దెబ్బతిన్న తోటల వివరాలను సత్వరం సేకరించి బాధిత రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గిరిమల్లప్ప, మాజీ ఎంపిపి పాలయ్య, సర్పంచి నాగరాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జి కాలవ సన్నన్న, కెపి దొడ్డి నాగరాజు, ధానవేంద్ర, సత్తి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ఎస్సీ, ఎస్టీల స్థలాలు కాపాడాలని ఆందోళన

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఎస్సీ, ఎస్టీ భూములు, స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, ఎస్సీ, ఎస్టీ సంఘాల జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మంలడ కేంద్రంలోని కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ ప్రజాసంఘాల సమితి ఆధ్వర్యంలో తహశీల్దార్ మోహన్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని సిద్దరాంపురం గ్రామంలో ఉన్న సర్వే నెం.139-2ఎలో ఎస్సీ కాలనీకి సంబంధించి దాదాపు 40సెంట్లు స్థలాన్ని కబ్జా చేశారన్నారు. ఈ స్థలాన్ని ఎస్సీ కాలనీ అవసరాలకు గతంలనే వదిలారన్నారు. ఈనేపథ్యంలో సంబంధిత స్థలంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం పెట్టాలని యువత ముందుకొస్తే కొన్ని రాజకీయ శక్తులు అడ్డుకున్నారని వాపోయారు. స్థానిక సర్పంచి అధికార బలంతో ఎప్పటికప్పుడు అడ్డు పుల్ల వేయడం తగదన్నారు. వీరి అనుచరులే కబ్జా చేస్తున్నారని ధ్వజమెత్తారు. దీంతోపాటు అభివృద్ధి సాకు చూపి సిసి రోడ్లు, కాలవలను ఆక్రమిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోమటి శేషు, జెఎసి నాయకులు రేకలకుంట రామాంజనేయులు, కాశప్ప, దండువారిపల్లి రాజు, పెద్ద వెంకటరాముడు, కొండమ్మ, కాశమ్మ, సరోజమ్మ, మండల వాసులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు

జగన్ పాలనపై ప్రజల్లో సంతృప్తి : ఎమ్మెల్యే వైవిఆర్

ప్రజాశక్తి-గుంతకల్లు

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత సిఎం జగన్ తీసుకొచ్చిన సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం చేపట్టి 15 రోజులు పూర్తయిన సందర్భంగా సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ రాజకీయాలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. 'మా నమ్మకం నువ్వే జగన్' ద్వారా కోటి కుటుంబాలను నేరుగా కలిసి వారి అభిప్రాయాలను తెలుసుకోవడం దేశంలోనే ఒక రికార్డు అన్నారు. ప్రభుత్వ పనితీరును సమర్థిస్తూ 76 లక్షల మిస్డ్ కాల్స్ రావడం గర్వించదగ్గ విషయమన్నారు. సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా పాలన సాగుతోందనే అభిప్రాయాన్ని లబ్ధిదారులు వ్యక్తం చేశారన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మరోసారి జగన్ ప్రభంజనం ఖాయమన్నారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్లు ఎన్.రామలింగప్ప, జింకల రామంజినేయులు, వైసిపి పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, మార్కెట్టు యార్డు ఛైర్మన్ ఎస్వీఆర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

పౌష్టికాహారంతో టీబీ వ్యాధి నయం

ఉరవకొండ : పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు మందులు సక్రమంగా వేసుకుంటే టీబీ వ్యాధిని నయం చేసుకోవచ్చని లయన్స్ క్లబ్ అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున, ప్రభుత్వ వైద్యాధికారి సాహితి సూచించారు. సోమవారం పట్టణంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున ఆధ్వర్యంలో ఉచితంగా పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిబి వ్యాధిగ్రస్తుల క్షేమం కోసం లయన్స్ క్లబ్ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఇందులో భాగంగానే నిరుపేదలైన 40 మంది టిబి వ్యాధిగ్రస్తులకు మూడోసారి పౌష్టికాహార కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, ట్రెజర్ నజీర్, రీజినల్ ఛైర్మన్ బాలచంద్ర, గౌరవ సభ్యులు గణేష్‌బాబు, ప్రభాకర్ నాయుడు, నాగేశ్వర్‌రావు, టీవీ ల్యాబ్ సూపర్‌వైజర్ మాణిక్యాలరావు, ఎస్టీఎల్ఎస్ కుళ్లాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

శింగనమల : వారం రోజుల క్రితం వడదెబ్బతో మృతిచెందిన గోవిందురానిపేట గ్రామానికి చెందిన ఇమామ్ హుస్సేన్ కుటుంబానికి వైసిపి నాయకుడు లక్ష్మీనారాయణరెడ్డి ఆధ్వర్యంలో వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేంద్ర సోమవారం రూ10వేలు అత్యవసర ఆర్థికసాయం అందజేశారు. వైఎస్ఆర్ బీమా పథకం కింద మంజూరయ్యే మిగిలిన రూ.90వేలు కూడా త్వరలోనే బాధిత కుటుంబ సభ్యుల ఖాతాకు జమ చేయనున్నట్లు తెలిపారు.

28న చిరుధాన్యాల సాగుపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-అనంతపురం

రాగి, సజ్జ, కొర్రలు, జొన్న పంట సాగుపై ఈనెల 28న స్థానిక కమ్మ భవన్‌లో రైతు లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్ తెలిపారు. ఈమేరకు సోమవారం స్థానిక జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయములో ఆదరణ పాడి పంటల క్షేత్రం మేనేజింగ్ డైరెక్టర్ నల్లపాటి రామకృష్ణతో కలిసి అవగాహన సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2023లో చిరుధాన్యాల సాగు గణనీయంగా పెంచాలని ఆదేశించిందన్నారు. ఇందులో భాగంగా చిరుధాన్యాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సాంకేతిక వ్యవసాయ అధికారులు రాకేష్‌నాయక్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల చేస్తున్న అగ్రికల్చర్ అధికారులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ఇండోర్ స్టేడియం పెవిలియన్ పరిశుభ్రం

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలల పాఠశాలలో మైదానంలో ఉన్న ఇండోర్ స్టేడియం పెవిలియన్‌ను ఎట్టకేలకూ అధికారులు సోమవారం శుభ్రం చేశారు. 'ముఖ్యమంత్రి వస్తున్నా మోక్షానికి నోచుకోని ఇండోర్ స్టేడియం' అన్న కథనం ఆదివారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితం కావడంతో జిల్లా అధికారులు స్పందించారు. కలెక్టర్ గౌతమి ఆదేశాల మేరకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సిఇఒ కేశవనాయుడు, ఎంపిడిఒ దివాకర్, ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహ ఆధ్వర్యంలో పెవిలియన్‌లో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించడంతోపాటు బ్లీచింగ్ చల్లి శుభ్రం చేశారు. అలాగే విరగొట్టిన తలుపులను వేయించినట్లు సిఇఒ కేశవనాయుడు తెలిపారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ పైనుంచి పడి మహిళ మృతి

మృతిచెందిన చంద్రకళ

బెలుగుప్ప : ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి పడి మాల చంద్రకళ (42) మృతిచెందిన ఘటన మండలంలోని కాలవపల్లి సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హనిమిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాల శ్రీనివాసులు భార్య చంద్రకళ వేరుశన నూర్పిడి పనులకు వెళ్లేది. ఇందులో భాగంగానే నూర్పుడి చేసే యంత్రాన్ని టాక్టర్‌కు తగిలించుకుని సోమవారం ఉదయం ఓబులాపురానికి బయలుదేరారు. కాలవపల్లి పెట్రోల్ బంకు వద్దకు రాగానే చంద్రకళ ప్రమాదవశాస్తూ కాల జారి కింద పడింది. దీంతో ట్రాక్టర్‌కు వెనుక కట్టుకుని వస్తున్న వేరుశనగ నూర్పిడి యంత్రం చంద్రకళపై వెళ్లి తీవ్రగాయాలయ్యాయి. హుటాహుటిన 108 సాయంతో అనంతపురం సవేరా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న బంధువులు బోరున విలపించారు. మృతురానికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. బాధితురాలి బంధువుల ఫిర్యాదు మేరకు జమేదారు శివశంకర్‌నాయక్ ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మట్కాబీటర్లు అరెస్టు

రాయదుర్గం రూరల్ : సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని గుట్టుచప్పుడు కాకుండా మట్కా రాస్తున్న ఐదుగురు మట్కాబీటర్లను సోమవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు రాయదుర్గం రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ యుగంధర్ తెలిపారు. రాయదుర్గం మండల పరిధిలోని ఆవులదట్ల గ్రామానికి చెందిన మంజునాథ్‌నాయక్, నరేష్‌నాయక్, గొల్ల నాగేంద్ర, బెలుగుప్ప మండలం ఎన్.గుండ్లపల్లికి చెందిన జింకల తిప్పస్వామి, మాల్యం వీరాంజనేయులును అరెస్టు చేసి రూ.3,25,000 నగదు, 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో అర్బన్ ఎస్ఐ శ్రీరాంప్రసాద్, కానిస్టేబుల్ రఘు, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మట్కాబీటర్ల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

హత్యాయత్నం కేసులో 8 మంది అరెస్టు

తాడిపత్రి రూరల్ : ఈ నెల 20న మండలంలోని బొందలదిన్నె గ్రామంలో కడప జిల్లా, తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన వైసిపి జిల్లా యువజన విభాగం సెక్రటరీ హరినారాయణరెడ్డి ప్రయాణిస్తున్న కారును మరో వాహనంతో ఢీకొట్టి హత్యాయత్నానికి యత్నించిన కేసులో 8 మందిని రూరల్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. కడప జిల్లా తాళ్ల పొద్దుటూరు గ్రామానికి చెందిన హరినారాయణరెడ్డి, అదేగ్రామానికి చెందిన చిన్న అంకిరెడ్డి, అతని అన్న రామసుబ్బారెడ్డి వైసిపిలో ఉన్నారు. అయితే హరినారాయణరెడ్డి రాజకీయంగా ఎదుగుతూ ఉండేవాడు. దీనికితోడు కొన్ని కాంట్రాక్టుల విషయంలో హరినారాయణరెడ్డి, అంకిరెడ్డి మధ్య విభేదాలు వచ్చాయి. దీంతో హరినారాయణరెడ్డిని ఎలాగైనా హతమార్చాలని అంకిరెడ్డి, రామ సుబ్బారెడ్డిలు పతకం రూపొందించి ఏప్రిల్ 20న క్యాంపర్ వాహనంతో హరినారాయణ ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టి చంపాలని యత్నించినట్లు తెలిపారు. దీంతో కేసులో నిందితులు అంకిరెడ్డి, రామసుబ్బారెడ్డి, డ్రైవర్ నరసింహాచారితోపాటు మరో ఐదుగురిని అరెస్ట్ చేసి క్యాంపర్ వాహనాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కి పంపినట్లు తెలిపారు.

కంకర టిప్పర్ల పట్టివేత

బొమ్మనహాల్ : మండలంలోని నేమకల్లు గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న కంకర క్వారీల నుంచి అనుమతులు లేకుండా కర్ణాటకకు తరలిస్తున్న మూడు టిప్పర్లను సోమవారం పట్టుకున్నారు. టిప్పర్ల ద్వారా కంకర తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న విజిలెన్స్ సీఐ రామారావు బృందం కర్ణాటక సరిహద్దులో దాడి చేసి టిప్పర్లను అదుపులోకి తీసుకోవడంతోపాటు కేసు నమోదు చేసి జరిమానా విధించినట్లు తెలిపారు. నిబంధనలను అతిక్రమించి ఎవరు కంకర తరలించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : విప్ కాపు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని రహదారులు, భవనాల విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా ఇప్పటికే 7 లక్షల మంది వైసీపీ సైనికులు పాలు పంచుకున్నారన్నారు. అంతేగాకుండా ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్నట్లు తెలిపారు. 50 ఇళ్లకు ఒక టీంగా క్లస్టర్ పరిధిలో పనిచేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. కాగా ఈనెల 26న ముఖ్యమంత్రి జగన్ నార్పల పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి గౌని ఉపేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌ఛైర్మన్‌లు శ్రీనివాసులు, వలిబాషా, కౌన్సిలర్లు ఫక్రుద్దీన్, గోవిందరాజులు, మార్కెట్ యార్డ్ వైస్‌ఛైర్మన్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం

ప్రచార భేరిలో వామపక్ష నాయకులు

ప్రజాశక్తి-పుట్లూరు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపి దేశాన్ని కాపాడుకుందామని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. వామపక్షాల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని మండలంలోని, అరకటివేముల, సూరేపల్లి గ్రామల్లో కరపత్రాలు పంచుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పెద్దయ్య, గ్రామ శాఖల కార్యదర్శులు సి.ఓబుళపతి, రామాంజనేయులు, రైతు సంఘం నాయకులు కె.పెద్ద కొండయ్య, పుల్లయ్య, బాల నారాయణ, ఆదెన్న, నాగరాజు పాల్గొన్నారు.

ప్రచార భేరిలో పాల్గొన్న వామపక్ష నాయకులు

ఉత్తమ పంచాయతీలకు అవార్డులు ప్రదానం

ప్రజాశక్తి-కుందుర్పి

మండల పరిధిలోని కుందుర్పి, మహంతపురం గ్రామాల సర్పంచిలు మారుతీశ్వరి రామ్మూర్తి, మసాలా జగన్‌లు సోమవారం ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డులు అందుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివద్ధే ధ్యేయంగా కషి చేస్తున్నామని జిల్లా జడ్పీ ఛైర్ పర్సన్ బోయ గిరిజమ్మ చేతుల మీదుగా అవార్డులు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి నిర్దిష్ట ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఎంపిపి చిట్రెడ్డి జయలక్ష్మి తెలిపారు. సోమవారం రాప్తాడు ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ సాల్మాన్ అధ్యక్షతన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని సీఎం వైఎస్ జగన్ గ్రామ సచివాలయాల ద్వారా సాకారం చేస్తున్నాన్నారు. గ్రామ పంచాయతీల ఏర్పాటు, వాటికి విస్తృత అధికారాలు ఇవ్వడానికి రాజ్యాంగం ప్రత్యేక అధికారాలు రూపొందించిందన్నారు. అనంతరం ఉత్తమ గ్రామ పంచాయతీలకు మంజూరైన ఉత్తమ పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్డి ఎస్.మాధవి, ఎఇ రత్నాబాయి, పిఆర్ ఎఇఇ ఓబులదాస్, వైస్ ఎంపిపి మన్నల వరలక్ష్మి, రైజేస్ ఎన్జీఓ కోఆర్డినేటర్ షర్మిల, జెజెఎం ఐఎస్ఎ కోఆర్డినేటర్ నరేష్, ఐఇసి కోఆర్డినేటర్ మౌళీశ్వరుడు, మండలాధికారులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కొండయ్య ఆధ్వర్యంలో సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మారుతి, ఇఒఆర్డి రఘురాంరావు, ఎంపిటిసిలు, సర్పంచులు, సీనియర్ అసిస్టెంట్ రవిచంద్ర ఆజాద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం సిటీ : అనంతపురం రూరల్ మండలం రుద్రంపేట పంచాయతీలో సర్పంచి సుగాలి పద్మావతి ఆదినారాయణ నాయక్ అధ్యక్షతన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మహాత్మా గాంధీ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మహబూబ్ బీ, పంచాయతీ కార్యదర్శి నరసింహారెడ్డి, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, జాతీయ ఉపాధి హామీ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో రుద్రంపేట పంచాయతీలో సర్పంచి సుగాలి పద్మావతి ఆదినారాయణనాయక్

శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపి తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలోని చాబాల రోడ్డులో ఉన్న ఆర్యవైశ్య హరిశ్చంద్ర ఘాట్ (శ్మశానం) ప్రహరీ, ఆర్చ్ నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపి తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ రూ.15లక్షల ఎంపి నిధులతో ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం ఎంపి, మాజీ ఎమ్మెల్యేలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లలిత, జెడ్పిటిసి పార్వతమ్మ, వైస్ ఎంపిపి నరసింహులు, ఉప సర్పంచి వన్నప్ప, ఇఒ గౌస్, బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, మాజీ ఎంపిపి ఎసి ఎర్రిస్వామి, మాజీ జెడ్పిటిసి తిప్పయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు తిరుపాలశెట్టి, బుసెట్టి రమేష్, చిత్రాల కామిశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

మహాబోధి కృష్ణమూర్తికి 'కళాసాహిత్య భూషణ్' బిరుదు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సాహిత్య వేదిక వ్యవస్థాపకులు దాసన్నగారి మహాబోధి కృష్ణమూర్తి గుర్రం పురస్కారం సాహిత్య కళా భూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం గుర్రం జాషువా స్మారక కళాపరిషత్ దుగ్గిరాల తెనాలి వారిచే మహాకవి పద్మభూషణ్ గుర్రం జాషువా స్మారక కళా పరిషత్ వ్యవస్థాపకులు పెద్దేటి యోహాను ఆధ్వర్యంలో అవార్డు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి టి.రామచంద్రుడు, ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్, ఎమ్మెల్యే శివకుమార్, ప్రముఖ గజల్ మాస్ట్రో శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేషగిరిరావు, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ కష్టంరాజు, మనం చక్రవర్తి ముఖ్య అతిథులుగా హాజరై అవార్డు అందజేశారు.

ఉద్యోగాలకు 39 మంది ఎంపిక

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక రుద్రంపేట పివికెకె ఇంజినీరింగ్ కళాశాలలో ప్రఖ్యాత ఐటీ సంస్థ స్మార్ట్ బ్రెయిన్ ఇంజనీర్స్ అండ్ టెక్నాలజీస్ ప్రయివేట్ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ బండి రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రాంగణ నియామకాలను పీవీకేకే ఐటీలో ఇప్పుడు బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న అన్ని విభాగాల విద్యార్థుల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రాంగణ నియామక అధికారి భానుకిరణ్ మాట్లాడుతూ ఇంటర్వ్యూ ప్రక్రియలో భాగంగా నిర్వహించిన బృంద చర్చలు, సాంకేతిక ఇంటర్వ్యూ, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ అనంతరం 39 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రత్యేకాధికారి శ్రీనివాసులురెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, డీన్ సంతోష్‌కుమార్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

సిఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం నియోజకవర్గ పరిధిలోని నారాయణపురం, ఇందిరమ్మ కాలనీ బ్రిడ్జి నిర్మాణానికి రూ.4.90 లక్షలు మంజూరు చేయడాన్ని హర్షిస్తూ సిఎం జగన్, ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి చిత్ర పటాలకు సోమవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జెసిఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ అనంతపురం నగరానికి దీటుగా నారాయణపురం పంచాయతీని తీర్చిదిద్దుతున్న ఘనత అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డికి దక్కుతుందన్నారు. తమ పంచాయతీ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యేతో పాటు ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ తలారి రంగయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బళ్లారి నాగేంద్ర, బి.మదన్‌మోహన్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, రామాంజులరెడ్డి, ఉమ్మడి మనోజ్‌రెడ్డి, పోతులయ్య, సుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సిఎం జగన్, ఎమ్మెల్యే అనంత చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి : ఎంపిపి

ప్రజాశక్తి-గుత్తి

దేశానికి పట్టుకొమ్మలైన గ్రామపంచాయతీలు అభివద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఎంపిపి గాండ్లపాటి విశాలాక్షి తెలిపారు. స్వయం సంవృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనతోపాటుగా పలు విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు మండలంలోని కొత్తపేట గ్రామ పంచాయతీ ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది. ఇందుకు సంబంధించి సోమవారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిడిఒ చిత్రా శ్రీనివాసులు, సర్పంచి ఆర్.గురుమస్తాన్‌కు ప్రసంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ చిత్రా శ్రీనివాసులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి తోడ్పాటున అందించాలన్నారు. కార్యక్రమంలో ఇఒఆర్డి శివాజీరెడ్డి, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇఇ దివ్య ప్రకాష్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి విశాలాక్షి

'ఆపద్బాంధవ' అధ్యక్షుడి రక్తదానం

ఉరవకొండ : మండలంలోని రాకెట్ల గ్రామానికి చెందిన ధనుంజయ, చిట్టెమ్మ దంపతుల కుమారుడు రెండేళ్ల ప్రజ్వల్‌కుమార్‌కు ఆపద్బాంధవ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు వేల్పుల మురళి సోమవారం రక్తదానం చేశారు. ప్రజ్వల్‌కుమార్ అనారోగ్య సమస్యతో కళ్యాణదుర్గం ఆర్టీటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈనేపథ్యంలో రక్తం ఎక్కించాలని వైద్యులు సూచించడంతో విషయం తెలుసుకున్న వేల్పుల మురళి హుటాహుటిన అనంతపురంలోని చైతన్య రక్తనిధికి చేరుకుని రక్తదానం చేశారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-గుత్తి

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ అధికారులు నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహశీల్దార్ ఎస్.మహబూబాషా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సందీప్, జూనియర్ అసిస్టెంట్ శంకర్, వీఆర్వోలు రంగయ్య, శివారెడ్డి, వైసిపి నాయకుడు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహశీల్దార్ మహబూబ్‌బాషా

బెలుగుప్ప: మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు దాహార్తి తీర్చేందుకు స్థానిక కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహశీల్దార్ ఈశ్వరయ్య శెట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ పీరా, ఆర్ఐ నగేష్‌బాబు, విఆర్ఓలు గోవిందప్ప, ఎర్రిస్వామి, రామకృష్ణ, హనుమంతరావు, నాగేంద్ర, ఎర్రిస్వామి, రామకృష్ణ, చంద్రశేఖర్, నగేష్, కీర్తి, వెన్నెల, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : రాయదుర్గం పురపాలక సంఘం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రారంభించారు. ప్రారంభం సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి, డిఇ రామ్మూర్తి, వైస్‌ఛైర్మన్లు శ్రీనివాసులు, వలిబాషా, కౌన్సిలర్లు గోవిందరాజులు, శారదా, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ విద్యార్థుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-ఉరవకొండ

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అత్యుత్తమ బోధన అందించి బంగారు భవిష్యత్తు ఇవ్వడమే ధ్యేయంగా అభయ, నిస్వార్థ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో సూపర్-60 కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఉరవకొండ లయన్స్ క్లబ్ అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున తెలిపారు. సోమవారం పట్టణంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో అభయ, నిస్వార్థ ఫౌండేషన్ కార్యదర్శి నాగమల్లి ఓబులేసు ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించిన 60 మందిని ఎంపిక చేసి వివిధ పోటీ పరీక్షలకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, గౌరవ సభ్యులు ప్రభాకర్, గణేష్‌బాబు, అభయ, నిస్వార్థ సేవా సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

క్షేత్రస్థాయిలోనే సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

కలెక్టర్ ఆదేశాల మేరకు 90 శాతం సమస్యలను మండల పరిధిలోని ప్రతి సచివాలయ పరిధుల్లోనే పరిష్కరిస్తున్నట్లు తహశీల్దార్ బి. రాము తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రతి సోమవారం సచివాలయాల్లో వచ్చే ఫిర్యాదులను ఏడు రోజుల్లోపు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో వివాదంలో ఉన్న విషయాలను మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకొస్తే వారు వెళ్లి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈనెలాఖరులోపు భూ రీ సర్వే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటి నుంచి భూమి కొనుగోలు చేసే వ్యక్తులు వారి పత్రాలను ఆధారంగా కాకుండా కొనే భూమిని సర్వే చేయించుకోవడం తప్పనిసరి అన్నారు.